క్లుప్తంగా

వినుకొండలో పోలీస్ పికెట్ ఏర్పాటు



వినుకొండ(నూజెండ్ల): శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై రౌడీషీట్ నమోదు చేస్తామని పట్టణ సీఐ సాంబశివరావు హెచ్చరించారు. మంగళవారం వినుకొండలో వైఎస్సార్ సీపీ, టీడీపీ వర్గాల మధ్య జరిగిన ఘర్షణలో పలువురికి గాయాలవడంతో శాంతి భద్రతల దృష్ట్యా వినుకొండలో నాలుగుచోట్ల పోలీస్ పికెట్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఎవరైనా అనుచరగణంతో తిరగడం, రాత్రి వేళల్లో గుంపులుగా కూడటం వంటి కార్యకలాపాలు నిర్వహించకూడదన్నారు. ప్రతిఒక్కరూ సామరస్య పూర్వకంగా పోలీసులకు సహకరించాలన్నారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై జిల్లా పోలీస్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కేసులు నమోదు చేస్తామని చెప్పారు.

నేడు వేమన సాహిత్యంపై చర్చా వేదిక

నరసరావుపేట ఈస్ట్: రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన యోగి వేమన జయంతిని పురస్కరించుకొని శ్రీనాథ సాహితీ పరిషత్ ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం 5గంటలకు పల్నాడు రోడ్డులోని పల్నాడు కళాక్షేత్రంలో వేమన సాహిత్యంపై చర్చా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పరిషత్ కార్యదర్శి స్వర్ణ చినరామిరెడ్డి బుధవారం తెలిపారు. నేటి సమాజంలో ప్రజాకవి వేమన సాహిత్యం అవసరమా? అనే అంశంపై సామాజిక, సాహిత్య చర్చ ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఈసందర్భంగా శ్రీనాథ సాహితీ పరిషత్ దశమ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆయా కార్యక్రమాలలో సాహితీవేత్తలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, కళాకారులు పాల్గొని చర్చా వేదికను జయప్రదం చేయాలని కోరారు.

ముగిసిన క్రికెట్ పోటీలు



శావల్యాపురం: మండల కేంద్రంలోని ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్ బుధవారంతో ముగిసినట్లు కమిటీ సభ్యులు తోట ప్రసన్నాంజనేయులు తెలిపారు. సంక్రాంతి పర్వదినం సందర్భంగా కొన్ని సంవత్సరాలుగా క్రీడాపోటీలు గ్రామస్తులు సహకారంతో జరుపుతున్నామన్నారు. మొదట బహుమతి మెరుపుదెబ్బ రూ.10,116 వేలు రెండవ బహుమతి కాకతీయ యూత్ రూ.5,116 వేలు, మూడోవ బహుమతి వారాహీ వారియర్స్ రూ.3116 రూపాయలు విజేతలకు నగదు బహుమతులు అందజేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో కొండపల్లి వెంకయ్య, చెరుకూరి బాలకృష్ణ, తురిమెళ్ళ నాగరాజు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మాజీ కౌన్సిలర్ మోహన రావు మృతి



నరసరావుపేట: వైఎస్సార్‌సీపీ మాజీ కౌన్సిలర్ మాడిశెట్టి మోహనరావు (36) మంగళవారం మృతిచెందారు. వారం క్రితం గుండెపోటురాగా స్థానిక వైద్యశాలలో డాక్టర్ల సలహా మేరకు స్టంట్ వేయించుకున్నారు. అప్పటి నుంచి ఆరోగ్యంగానే ఉన్న మోహనరావు మంగళవారం గృహంలో ఉండగా రెండోసారి గుండెపోటుకు గురయ్యా రు. కుటుంబ సభ్యులు వెంటనే వైద్యశాలకు తరలించగా అప్పటికే మృతిచెందినట్లు డాక్టర్లు ప్రకటించారు. స్థానిక మున్సిపల్ కౌన్సిల్‌కు 29వ వార్డు నుంచి పార్టీ తరపున కౌన్సిలర్‌గా వ్యవహరించి సమస్యలను పరిష్కరించటంలో సమర్థుడిగా పేరు తెచ్చుకున్నాడు. పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా వ్యవహరిస్తున్నాడు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి గృహానికి వెళ్లి మృతదేహానికి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. పల్నాడు జిల్లా అర్బన్ డవలప్మెంట్ అథార్టీ చైర్మన్ మిట్టపల్లి రమేష్‌తో పాటు పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు, మాజీ కౌన్సిలర్లు మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. మోహనరావు తండ్రి మాడిశెట్టి వెంకటేశ్వర్లు కూడా మాజీ కౌన్సిలర్ కావటం గమనార్హం.

జగనన్న రాకతోనే గ్రామాలకు సుపరిపాలన

- ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు
- ఉప్పరపాలెంలో సచివాలయ భవనాల ఆరంభం



సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

వినుకొండ(నూజెండ్ల): ప్రతిగ్రామంలో గ్రామపరిపాలన విధానాన్ని తీసుకొచ్చి సుపరిపాలనను అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. వినుకొండ రూరల్ మండలం ఉప్పరపాలెం గ్రామంలో నూతనంగా నిర్మించిన సచివాలయ భవనం, వైఎస్సార్ రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ హెల్త్‌సెంటర్ భవనాలను ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు బుధవారం ప్రారంభించారు. అలాగే గ్రామంలో ఏర్పాటు చేసిన వైఎస్సార్ విగ్రహానికి ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే బొల్లా మాట్లాడుతూ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి గ్రామ పరిపాలన వ్యవస్థను తీసుకొచ్చి 1.30 లక్షలకు పైగా ఉద్యోగాలను కల్పించి ప్రతి సంక్షేమాన్ని గడప ముందుకే తీసుకొచ్చి, ఎలాంటి సమస్యలైనా గ్రామంలోనే పరిష్కారమయ్యే విధంగా చర్యలు తీసుకుంటున్నారన్నారు.

గత ప్రభుత్వంలో ఎలాంటి సమస్యలైనా మండలంలో ఉన్న మండల కార్యాలయాల చుట్టూ రోజుల తరబడి తిరగాల్సి వచ్చేదని, నేడు అలాంటి పరిస్థితి లేకుండా వలంటీర్ల వ్యవస్థ ద్వారా ప్రతి ఒక్కరికీ నవరత్న పథకాలు అందాలని నేరుగా వారి ఖాతాల్లోకే డబ్బులను జమ చేస్తున్నామన్నారు. గత టీడీపీ హయాంలో పింఛన్ వెయ్యి రూపాయలు ఇస్తే, ప్రస్తుతం వైఎస్సార్ సీపీ హయాంలో రూ.3 వేల వరకు ఇస్తున్నామని చెప్పారు. అర్హులైన వారందరికీ ప్రతినెలా 1వ తేదీన తెల్లవారుజామున వలంటీర్లు ఇంటి వద్దకు వచ్చి మరీ పింఛన్ అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రికే దక్కుతుందన్నారు. సంక్షేమాన్ని, అభివృద్ధిని ప్రజలు గమనించి ప్రజామద్దతు తెలపాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎస్ఎల్‌ను సందర్శించిన మాజీ ఉపరాష్ట్రపతి



మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న మండవ ప్రభాకరరావు

యడ్లపాడు: మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడుకి ఎస్ఎస్ఎల్ టెక్స్‌టైల్ లిమిటెడ్ చైర్మన్ మండవ ప్రభాకరరావు సాదరంగా స్వాగతించారు. బుధవారం పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేటలో కే-రిడ్జ్ పాఠశాల ప్రారంభోత్సవానికి హాజరయ్యే క్రమంలో క్రమంలో వెంకయ్యనాయుడు యడ్లపాడులోని ఎస్ఎస్ఎల్ నూలుమిల్లును సందర్శించారు. పోలీసులు మాజీ ఉపరాష్ట్రపతికి గౌరవ వందనం చేశారు. అనంతరం పరిశ్రమల స్థితిగతులపై ఆరా తీశారు. అనంతరం ఆయనను పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఏపీ స్పిన్నింగ్ మిల్స్ మాజీ చైర్మన్ వైఎస్ చైర్మన్లు గోరంట్ల పున్నయ్య చౌదరి, సామినేని కోటేశ్వరరావు, సీనియర్ నాయకులు ఆర్ లక్ష్మీపతి, బీజేపీ నాయకులు పోట్రు పూర్ణచంద్రరావు, కస్తూరి వెంకటేశ్వర్లు, యడ్లపాడు ఎస్ఎస్ఎల్ మిల్లు జీఎం హెచ్ఆర్ ఎం.నరసింహం, స్పిన్నింగ్ జీఎం మురళీ, బుజ్జిబాబు, కాటన్ జీఎం సాంబశివరావు తదితరులు ఉన్నారు.

అన్నవరంలో పర్యటించిన కలెక్టర్ శివశంకర్

అంగన్ వాడీ కేంద్రం తనిఖీ



వివరాలు అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ లోతేటి శివశంకర్

రొంపిచర్ల: మండల పరిధిలోని అన్నవరం గ్రామంలో జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ బుధవారం పర్యటించారు. స్థానిక దళితవాడలో గల అంగన్ వాడీ కేంద్రాన్ని సందర్శించారు. దళితవాడలో నివాసముంటున్న ఓ గర్భిణీ ఇంటికి వెళ్లి అంగన్ వాడీ కేంద్రం నుంచి అందుతున్న కోడిగుడ్లు, పాలు, బియ్యం, కందిపప్పు, ఆయిల్ గురించి అడిగి తెలుసుకున్నారు. అంగన్ వాడీ కేంద్రంలో ఉన్న పిల్లలకు కోడిగుడ్లు వేడిచేసి ఇస్తున్నారా, లేదా అని ప్రశ్నించారు. అన్ని సక్రమంగా ఉండడంతో సంతృప్తి వ్యక్తం చేశారు. అంగన్ వాడీ కేంద్రం పనితీరును అక్కడ ఉన్న వారిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ జి. అంకారావు, సీడీపీఓ ఉమామహేశ్వరి, ఐసీడీయస్ సూపర్ వైజర్ శశిదేవి, రెవెన్యూ సిబ్బంది, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీల అభివృద్ధిపై రెండు రోజుల శిక్షణ

బొల్లాపల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో రెండు రోజుల ఓరియంటల్ శిక్షణ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి ఎంపీడీఓ ఎస్‌కె జిలానీ బాషా మాట్లాడుతూ పంచాయతీలను ప్రణాళిక ప్రకారం అభివృద్ధి చేయాలని తెలిపారు. పంచాయతీల్లో స్థిరమైన ఆస్తులను ఏర్పరచుకోవాలని సూచించారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి గాను పంచాయతీల అభివృద్ధి గురించి ప్రణాళిక తయారు చేసుకునే విధంగా శిక్షణలో వివరించడటం జరుగుతుందన్నారు. తొమ్మిది రకాల సుస్థిర అభివృద్ధిపై ప్రణాళిక ఉంటుందని తెలిపారు. వీటిలో ఒక రకాన్ని ఎంచుకుని పంచాయతీలో అభివృద్ధికి బాట వేయాలని, పనులను గుర్తించడటం, గ్రామసభలో తీర్మానం చేయడం ప్రతిపాదనలు తయారు చేసి ఆన్‌లైన్ నమోదు చేయాలని శిక్షణలో వివరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

నేడు సర్పంచ్‌లు, అధికారులకు శిక్షణ

నాదెండ్ల: మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ ఒక్కరోజు అధికారులకు, ప్రజాప్రతినిధులకు శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో షేక్ జాకీర్ హుస్సేన్ తెలిపారు. గ్రామ పంచాయతీ అభివృద్ధి, ప్రణాళిక అనే అంశంపై సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు శిక్షణ ఉంటుందన్నారు.

సర్వే పారదర్శకంగా చేపట్టాలి

శావల్యాపురం: కులగణన సర్వే వలంటీర్లు పారదర్శకంగా జరిగేలా క్షేత్రస్థాయిలో గ్రామసచివాలయ ఉద్యోగులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని మండల ప్రత్యేక అధికారి మూలె వెంకటరెడ్డి అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో కుల గణన సర్వే, పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలపై పంచాయతీ కార్యదర్శులకు, సచివాలయ ఉద్యోగులకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల ప్రత్యేక అధికారి మాట్లాడుతూ ఈనెల 19 నుంచి 29 వరకు అన్నీ గ్రామాల్లో వలంటీర్లు ఇంటింటి సర్వే చేసి ప్రభుత్వం రూపొందించిన మొబైల్ యాప్‌లో నమోదు చేయాలన్నారు. గతంలో కులాలకు సంబంధించి ప్రభుత్వం అమోదించిన ధ్రువీకరణ పత్రాలను కూడా పరిగణలోకి తీసుకో వచ్చునన్నారు. కులం పేరు తప్పనిసరిగా మొబైల్ యాప్ నమోదు చేయాలన్నారు. కుల గణన సర్వేకు ప్రజలు తమవంతు సహకారం అందించాలన్నారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి గాను పంచాయతీలు చేయాల్సిన అభివృద్ధి పనులు నిధులు వినియోగం తదితర వాటిపై భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులు గ్రామాల్లో ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనపై సర్పంచ్‌లు వార్డు సభ్యులకు సమావేశాలు నిర్వహించి తెలియజేయాల్సిన బాధ్యత పంచాయతీ కార్యదర్శులపై ఉందన్నారు. ఈ సమావేశంలో ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య, ఈవోపీఆర్‌డీ పి.సుగుణ, ఏపీయం జి.వాసుబాబు పాల్గొన్నారు.

సంప్రదాయానికి ప్రతీకలు రంగవల్లులు



చిలకలూరిపేట: ముగ్గుల పోటీలు సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మల్లెల రాజేష్‌నాయుడు చెప్పారు. పట్టణ ఆర్యవైశ్యసంఘం, లయన్స్‌క్లబ్ ఆఫ్ చిలకలూరిపేట సంయుక్త ఆధ్వర్యంలో ఆర్యవైశ్య కల్యాణ మండప ప్రాంగణంలో సంక్రాంతి మహారాణుల ముగ్గుల పోటీలు మంగళవారం రాత్రి నిర్వహించారు. పోటీలు సీనియర్స్, జూనియర్స్ విభాగాల్లో కొనసాగాయి. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మల్లెల రాజేష్‌నాయుడు మాట్లాడుతూ ముగ్గుల పోటీలతో మహిళల్లో సృజనాత్మకత పెరుగుతుందన్నారు. ముగ్గుల పోటీలు ఐక్యతకు, ఆప్యాయతకు నిదర్శనమన్నారు. సంక్రాంతి సంబరాలలో భాగంగా నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమాలు మానసిక వికాసానికి, ఏకాగ్రతకు ఎంతగానో దోహదపడతాయన్నారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి మహిళల అభ్యున్నతికి, సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నారని చెప్పారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. మున్సిపల్ వైస్ చైర్మన్ కొలిశెట్టి శ్రీనివాసరావు, కోఆప్షన్ సభ్యులు పోలిశెట్టి మస్తాన్‌రావు, పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కొప్పురావూరి పటేల్, రావికింది సత్య దుర్గ మణికుమార్, ఉమ్మడి గుంటూరు జిల్లా ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షులు తులాబందుల మణిదీప్, ఆర్యవైశ్య కల్యాణ మండప సంఘ కార్యదర్శి పాటి శ్రీరాములు, తాళ్ల అంజిరెడ్డి, అలపాటి వెంకట్రావు, కొండవీటి ఆంజనేయులు పాల్గొన్నారు.

క్షేత్రస్థాయి ప్రణాళికలే గ్రామాభ్యుదయానికి దోహదం

యడ్లపాడు: గ్రామాల సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు చేరుకునే విధంగా అధికారులు గ్రామ అభివృద్ధి ప్రణాళికలు తయారు చేసుకోవాలని ఎంపీపీ పిడతల ఝాన్సీసాగర్ చెప్పారు. మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక (జీపీడీపీ) రెండు రోజులు శిక్షణ కార్యక్రమాన్ని ఆమె బుధవారం ప్రారంభించారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్రాలు మంజూరు చేసే నిధుల ఆధారంగా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి అభివృద్ధి ప్రణాళికలను రూపొందించాలన్నారు.

వైఎస్సార్ పశుబీమాతో పశుపోషకులకు మేలు

బొల్లాపల్లి: వైఎస్సార్ పశుబీమా పథకం ప్రభుత్వ రాయితీ వర్తిస్తుందని పశుసంవర్ధక అధికారి పి.అమీర్‌బాషా తెలిపారు. మండలంలో పశువులు, జీవాల యజమానులు ఈ పథకాన్ని సద్వినియోగపరచుకోవాలని తెలియజేశారు. ఇప్పటి వరకు మండలంలో 130 మంది రైతులు బీమా కల్పించారని తెలిపారు. రైతు సోదరులు వైఎస్సార్ పశుబీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మేలు జాతి రకం రూ.30 వేలు విలువ చేసే పశువుకు, నాటు పశువు రూ.15 వేలు, మేలు జాతి ఎద్దులు, దున్నలు రూ.30 వేలు విలువ చేసే, నాటు ఎద్దులు, దున్నలు రూ.15 వేలు విలువ చేసే, ఆరు నెలలు ఆపైబడిన వయసు గల మేకలు, గొర్రెలు, పందులు రూ.6 వేలు విలువ చేసే వీటికి 80, 50 శాతం పశుపోషకులకు రాయితీపై పథకం వర్తిస్తుందని, పథకాన్ని వినియోగించుకోవాలన్నారు.



కే-రిడ్జ్ ఇంటర్నేషనల్ స్కూల్ ప్రారంభోత్సవంలో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు, ఎంపీ లావు కృష్ణదేవరాయలు – నరసరావుపేట

అందరివాడు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్



పోస్టర్ ఆవిష్కరిస్తున్న మల్లెల రాజేష్ నాయుడు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బొల్లా, పార్టీ నాయకులు

- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మల్లెల రాజేష్ నాయుడు
- వినుకొండలో పోస్టరు ఆవిష్కరించిన ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

చిలకలూరిపేట: అసమానతలు రూపుమాపేలా రాజ్యాంగాన్ని రచించిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కులమతాలకు అతీతంగా అందరివాడని వైఎస్సార్ సీపీ నియోజక వర్గ సమన్వయకర్త మల్లెల రాజేష్ నాయుడు చెప్పారు. విజయవాడ స్వరాజ్ మైదానంలో ఈనెల 19వ తేదీన ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి చేతుల మీదుగా అంబేడ్కర్ విగ్రహావిష్కరణ, సమతా మహాసభ నిర్వహిస్తున్న నేపథ్యంలో పట్టణంలోని బ్యాంక్ కాలనీలో ఉన్న వైఎస్సార్ సీపీ కార్యాలయంలో బుధవారం సన్నాహక సమావేశం నిర్వహించారు. ముఖ్యమంత్రి జగనన్న బీఆర్ అంబేడ్కర్‌పై ఉన్న అభిమానంతో 206 అడుగుల భారీ విగ్రహాన్ని రూ.404 కోట్లతో ఏర్పాటు చేయించారని చెప్పారు.

లోటు బడ్జెట్‌లోనూ సంక్షేమ పాలన

రాష్ట్రంలో లోటు బడ్జెట్‌లోనూ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత సీఎం జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. అదే విధంగా రాయలసీమ మొదలుకుని ఉత్తరాంధ్ర జిల్లాల వరకు ఎన్నో నూతన పరిశ్రమలు స్థాపించి లక్షలాది మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించిన ఘనత కూడా సీఎం వై.ఎస్.జగన్‌దే అన్నారు. ఈ సందర్భంగా కార్యక్రమ పోస్టర్లను పార్టీ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. వైఎస్సార్ సీపీ పట్టణ కార్యదర్శి మారుబోయిన నాగరాజు అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్లు వలేటి వెంకటేశ్వరరావు, కొలిశెట్టి శ్రీనివాసరావు, ఎంపీపీలు దేవినేని శంకరరావు, పిడతల ఝాన్సీసాగర్, తలతోటి రాణి, జెడ్పీటీసీ సభ్యులు కోడె సుధారాణి, కాట్రగడ్డ మస్తాన్‌రావు, ముక్తావాసు, పట్టణ పార్టీ అధ్యక్షులు క్లస్టర్–1 పఠాన్ తలహాఖాన్, క్లస్టర్ –2 విడదల కమలేంద్ర, మండల పార్టీ అధ్యక్షులు గుత్తా యాములయ్య, మద్దూరి కోటిరెడ్డి, ఘంటా శంకర్, సొసైటీ అధ్యక్షులు కొండవీటి ఆంజనేయులు, మంగు ఏడుకొండలు, కురుకుంట్ల వెంకటరెడ్డి, రాష్ట్ర ముస్లిం కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ దరియావలి, నాయకులు బేరింగ్ మౌలాలి, అల్లడి ఆదిబాబు, బాలకోటి నాయక్, మైలా రాజేష్, పంగులూరి వెంగళరాయుడు, యడ్ల సురేష్, అల్లడి రవికుమార్, పిల్లి సాగర్, కొచ్చెర్ల కిషోర్, ఎంపీటీసీ లు పాల్గొన్నారు.

విగ్రహావిష్కరణ విజయవంతం చేయాలి

వినుకొండ(నూజెండ్ల): విజయవాడలో ఈనెల 19న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆవిష్కరిస్తున్న భారీ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమం విజయవంతం చేయాలని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక వెస్సార్ సీపీ కార్యాలయంలో పార్టీ ముఖ్యనాయకులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ నాయకుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా అంబేడ్కర్ విగ్రహావిష్కరణ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు.

ఉత్సాహంగా 'ఆడుదాం ఆంధ్రా'



కనపర్రులో క్రికెట్ పోటీలు ప్రారంభిస్తున్న ఎంపీపీ రాణి, జెడ్పీటీసీ మస్తాన్‌రావు



గెలుపొందిన బొగ్గరం మహిళా జట్టు



వాలీబాల్ క్రీడాకారుల పరిచయ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీడీవో సీతారామయ్య

- ఉల్లాసంగా క్రికెట్ ఆడిన యువత
- క్రీడలతో ఉద్యోగావకాశాలు : జెడ్పీటీసీ

నాదెండ్ల: క్రీడల్లో రాణించే క్రీడాకారులకు జాతీయ, అంతర్జాతీయస్థాయి గుర్తింపుతో పాటూ ఉద్యోగ అవకాశాలుంటాయని ఎంపీపీ తలతోటి రాణి, జెడ్పీటీసీ కాట్రగడ్డ మస్తాన్‌రావు చెప్పారు. ఆడుదాం ఆంధ్రాలో భాగంగా బుధవారం కనపర్రు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో మండలస్థాయి క్రికెట్ పోటీలను ప్రారంభించారు. మండలస్థాయిలో అన్ని సచివాలయాల నుంచి 11 జట్లు పాల్గొన్నాయి. తొలిరోజు ఆరు జట్లకు పోటీలు జరిగాయి. ముందుగా సర్పంచ్ పెరుమాళ్ళపల్లి వెంకటేశ్వర్లు, ఎంపీపీ రాణి, జెడ్పీటీసీ మస్తాన్‌రావు, ఎంపీడీవో జాకీర్ హుస్సేన్, ఎంఈవో అంజనేయులు క్రీడాకారుల పరిచయం అనంతరం కొద్దిసేపు క్రికెట్ ఆడి క్రీడాకారులను ఆనందపరిచారు. కార్యక్రమంలో పీడీలు నాగరాజు, అమీర్, బాషా, కె.శ్రీనివాసులు, ఫిలిప్‌రాజుతో పాటూ నాయకులు మద్దూరి కోటిరెడ్డి, పచ్చవ కోటేశ్వరరావు, కురుకుంట్ల వెంకటరెడ్డి, మాలె వెంకటస్వామి, పంచాయతీ కార్యదర్శులు అహ్మద్, కాంతారావు పాల్గొన్నారు.

ఖోఖో మండల స్థాయి విజేత బొగ్గరం జట్టు

ఈపూరు: మండల స్థాయిలో జరుగుతున్న ఆడు దాం ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ఖోఖో మహి ళా విభాగంలో బొగ్గరం జట్టు గెలిచినట్లు పంచా యతీ సెక్రటరీ అనురాధ తెలిపారు. నియోజకవర్గ స్థాయి, జిల్లా స్థాయి, రాష్ట్రస్థాయిలో బాగా రాణించాలని ఆ కాంక్షించారు. అనంతరం విజేతలకు గోనుగుంట్ల శ్రీనివాసరావు, నాగార్జున, రాకేష్‌బాబులు దుస్తులు పంపిణీ చేయడం జరిగింది. వైఎస్సార్ సీపీ నాయకులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

శావల్యాపురంలో ..

శావల్యాపురం: ఆడుదాం–ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా మండలస్థాయి పోటీలు జరుగుతున్నట్లు ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య తెలిపారు. బుధవారం మండలంలోని శావల్యాపురం, వేల్పూరు గ్రామాల్లోని జెడ్పీ ఉన్నత పాఠశాల్లో జరుగుతున్న క్రీడాపోటీలను ప్రారంభించి క్రీడాకారుల పరిచయ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలు మేరకు క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, బాల్‌బ్యాడ్మింటన్ పోటీలను పారదర్శకంగా జరిగేలా నిరంతరం పర్యవేక్షణ చేస్తున్నట్లు తెలిపారు. మండల స్థాయిలో క్రికెట్, వాలీబాల్ క్రీడా పోటీలు ముగిశాయన్నారు.

స్నేహమేరా శాశ్వతం



వారంతా వేల్పూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1999-2000 విద్యా సంవత్సరంలో పదో తరగతి అభ్యసించారు. దాదాపుగా 22 సంవత్సరాల క్రితం విద్యాభ్యాసం చేసిన ఈ విద్యార్థులంతా తాము చదువుకున్న పాఠశాలకు బుధవారం కదలివచ్చా రు. ఆనాటి అపురూప సందర్భాలను వారంతా నెమరు వేసుకున్నారు. తరగతి గదుల్లోని తీపి జ్ఞాపకాలను, చిలిపి చేష్టలను గుర్తు చేసుకుని ఆనందించారు. పాఠశాలలో ఉపాధ్యాయులు చెప్పిన విద్యవల్లే తామంతా వివిధ స్థాయిల్లో ప్రయోజకులమయ్యామని చెప్పుకున్నారు. కుటుంబ యోగ క్షేమాలు, ఆరోగ్యస్థితిగతులు, అప్యాయ పలకరింపులతో పాఠశాలలో సందడి వాతావరణం కనిపించింది. అనంతరం తమ గురువులను ఘనంగా సత్కరించారు. తాము చదువుకున్న పాఠశాల అభివృద్ధిలో తమవంతు సహకారం అందిస్తామని వారంతా హామీ ఇచ్చారు. 40 మంది విద్యార్థుల 'అపూర్వ' సమ్మేళన కార్యక్రమానికి కమిటీ ప్రతినిధి జ్యోతి శ్రీనివాసరావు సారథ్యం వహించారు.

–శావల్యాపురం